E-KABURU E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 02-05-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా? » 3లో

# కులగణనలో దేశానికే ఆదర్శం కాంగ్రెస్ విజయం

**కులగణన నిర్ణయం కాంగ్రెస్ విజయమని, దేశవ్యాప్తంగా దీనిని నిర్దిష్ట వ్యవధిలోగా పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు.**



- రాహుల్‌ను ప్రధాని మోదీ ఆదర్శంగా తీసుకున్నారు
- రాష్ట్ర అనుభవాలను కేంద్రంతో పంచుకునేందుకు సిద్ధం
- రాజకీయ లబ్ధి కోసమే భాజపా రాష్ట్ర నాయకుల విమర్శలు
- లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దయ్యేవి

ఈ కబురు, హైదరాబాద్: కులగణన నిర్ణయం కాంగ్రెస్ విజయమని, దేశవ్యాప్తంగా దీనిని నిర్దిష్ట వ్యవధిలోగా పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభించి ఎప్పుడు ముగిస్తారో వెల్లడించాలని... ఏడాది గడువులోగా పూర్తిచేసి అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. తెలంగాణ చేసిన కులగణనతో దేశానికి లాభం జరిగిందని అన్నారు. కులగణనపై కేంద్రం నిర్ణయం తీసుకున్నందున తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని అభినందించారు. అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. "న్యాయచిక్కులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం చట్టబద్ధంగా, విజయవంతంగా కులగణన సర్వే పూర్తిచేసింది. ఇది దేశానికి ఆదర్శంగా మారింది. మా అనుభవాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. మా అనుభవాలు, సూచనలు, సలహాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. కేంద్ర అధికారులు ఇక్కడికి వచ్చినా సరే... లేదా ఇక్కడి అధికారుల్ని దిల్లీకి రమ్మన్నా సరే. బలహీనవర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్‌పార్టీ ఒక మెట్టు దిగి... కేంద్రానికి అవసరమైన సమాచారాన్ని, అనుభవాలను అందిస్తుంది. ఎలాంటి భేషజాలు లేవు. ఈ విషయంలో కేంద్రంతో కలిసి పని చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కేంద్రం అన్ని రాష్ట్రాలతో చర్చించి ఈ ప్రక్రియ పూర్తిచేయాలి" అని సూచించారు. కాంగ్రెస్‌పార్టీ ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్రమోదీ కులగణనపై నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయానికి రాజకీయాలకు తావులేకుండా కేంద్రానికి అభినందనలు చెబుతున్నానని అన్నారు. కులగణనకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

తరువాయి 2లో

## కులగణనలో తెలంగాణది రాంగ్ మోడల్



**కేంద్ర ప్రభుత్వ కులగణన నిర్ణయానికి సంబంధించిన ఘనత తమదేనని కాంగ్రెస్ చెప్పడాన్ని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తప్పుపట్టారు.**

**రేవంత్ సర్కారు చేసింది బీసీ వ్యతిరేక సర్వే**


**కులగణనకు అనుకూలంగా 2010లో నాటి ఆర్థికమంత్రికి సుష్మాస్వరాజ్ రాసిన లేఖను చూపుతున్న కిషన్‌రెడ్డి**

ఈ కబురు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వ కులగణన నిర్ణయానికి సంబంధించిన ఘనత తమదేనని కాంగ్రెస్ చెప్పడాన్ని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తప్పుపట్టారు. ఆయన గురువారం ఇక్కడ తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. "మోదీ పదేళ్లలో కులగణన ఎందుకు చేయలేదు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. 2010లో రేవంత్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో మాకు తెలియదు. కులగణనకు

» 2లో

## ముంబయి సిక్సర్.. వరుసగా ఆరో విజయంతో అగ్రస్థానానికి

» 6లో



## ధోనికి ఇలా జరగడం ఇదే తొలిసారి..!

» 6లో



## హిట్3.. నాని యాక్షన్ థ్రిల్లర్ మెప్పించిందా?

» 5లో




## బంగారమా..? మాకొద్దు బాబోయ్..!

» 4లో



## తెలంగాణలో కొత్త పాలసీ.. వారికే లబ్ధి.. సీఎం రేవంత్ ప్రకటన..




- గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పులు రూ.8.29 లక్షల కోట్లు
- రాష్ట్ర రాబడిలో నెలకు రూ.6,500 కోట్లు అప్పులకే పోతోంది
- ఆర్టీసీ కార్మికులారా... సమ్మె ఆలోచన వద్దు
- కార్మిక దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**నెల జీతంలో నిత్యావసరాలు, ఇతర ఖర్చులకు బడ్జెట్ పద్మనాభం వేసుకునే లెక్కల మాదిరి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తానూ లెక్కలు వేసుకుంటున్నానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.**

ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో కాలె యాదయ్య, రాజ్‌ఠాకూర్, జనక్ ప్రసాద్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వేణుగోపాల్‌రావు, దానకిశోర్

ఈ కబురు, హైదరాబాద్: నెల జీతంలో నిత్యావసరాలు, ఇతర ఖర్చులకు బడ్జెట్ పద్మనాభం వేసుకునే లెక్కల మాదిరి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తానూ లెక్కలు వేసుకుంటున్నానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతినెలా రాష్ట్రప్రభుత్వానికి వస్తున్న ఆదాయం రూ.18,500 కోట్లు కాగా సుమారు రూ.30 వేల కోట్లు అవసరమని, దాదాపు రూ.12 వేల కోట్ల ఆదాయం తక్కువగా ఉందని వివరించారు. అయినా ఏ సంక్షేమ పథకాన్ని ఆపలేదని అన్నారు. నెలవారీ వచ్చే ఆదాయంలో రూ.6,500 కోట్లు అప్పులకు, రూ.6 వేల కోట్లు జీతభత్యాలు, పింఛన్లకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. రవీంద్రభారతిలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతున్నాం. రాష్ట్రాన్ని గాడిన పెట్టే క్రమంలో నాతోపాటు మంత్రివర్గ సహచరులు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. పది సంవత్సరాలు పాలించిన కేసీఆర్ ప్రభుత్వం రూ.8.29 లక్షల కోట్ల అప్పులు చేసింది.

తరువాయి 2లో



## పాలమూరు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ వేగవంతంగా పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్

ఈ కబురు: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ వేగవంతంగా చేయడానికి, ఉన్న సమస్యలను పరిష్కరించి అవాంతరాలను తొలగించడానికి తాము ప్రాజెక్టులను సందర్శిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నార్లాపూర్ ఏదుల వట్టెం కరివేన రిజర్వాయర్లలో 50 టీఎంసీల నీటిని నింపడానికి ఆరు నెలల సమయం పెట్టుకొని అందుకు ఏ ఏ పనులు చేయాలో సమీక్షలో చర్చిస్తామని మంత్రి తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం లో నిర్మాణంలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో పంప్ హౌస్ నార్లాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ 3 ఓపెన్ కెనాల్ పనులతో పాటు ఎంజి కే ఎల్ ఐ మొదటి లిఫ్టులోని పంప్ హౌస్ స్విచ్ యార్డ్ పనులను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి తో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. ఈ పనులను పరిశీలించేందుకు కోసం హైదరాబాదు నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో నార్లాపూర్ రిజర్వాయర్ కు చేరుకున్నారు.

» 2లో

## 'ఏ ఒక్కరినీ వదిలిపెట్టం'.....

### పహల్గాం ఘటనపై అమిత్ షా



**ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు.**

ఈ కబురు: దేశంలో ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే తమ ప్రభుత్వ సంకల్పమని, దీన్ని సాధించి తీరుతామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి కారకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఉగ్రవాదంపై పోరులో దేశవాసులే కాకుండా.. ప్రపంచమంతా భారత్ వెంటే నిలుస్తోందని తెలిపారు. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు.

» 2లో


## ఇండియాను సృజనాత్మక కేంద్రంగా మారుస్తాం.. ప్రధాని మోడీ



ఈ కబురు: భారత్‌లో సృజనాత్మకత వెల్లువెత్తుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు క్రియేటర్లు మరింత ఊపును తీసుకురాగలరని తెలిపారు. రాబోయే రోజుల్లో క్రియేటర్లు దేశ జీడీపీకి గణనీయంగా దోహదపడతారని నొక్కి చెప్పారు. గురువారం ఆయన ముంబైలోని జియో వరల్డ్ సెంటర్‌లో వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. 'భారతదేశ ఆరెంజ్ ఎకానమీ కంటెంట్, సృజనాత్మకత, సంస్కృతి అనే మూడు బలమైన స్తంభాలపై ఆధారపడి ఉంది. కాబట్టి రాబోయే రోజుల్లో దేశ జీడీపీలో ఈ రంగం గణనీయమైన వాటాను కలిగి ఉంటుంది' అని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ యానిమేషన్ మార్కెట్ విలువ 430 బిలియన్ డాలర్లకు పైగా ఉందని, రాబోయే పదేళ్లలో ఇది రెట్టింపు అవుతుందన్నారు. 100కి పైగా ప్రపంచ దేశాల్లో భారతీయ సినిమాలు ప్రదర్శింపబడుతున్నాయని తెలిపారు. విదేశీ ప్రేక్షకులు భారతీయ సినిమాలను చూడటమే గాక వాటికి అర్థం చేసుకోవడానికి కూడా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. భారతదేశం చలనచిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, మ్యూజిక్‌కు ప్రపంచ కేంద్రంగా మారిందన్నారు.

తరువాయి 2లో

## రిజర్వేషన్లు 68 శాతానికి పెంచాలి: ఖర్గే డిమాండ్



» 3లో

## ప్రధానిగా మన్మోహన్ ఎప్పుడూ పాకిస్థాన్ వెళ్లలేదు..



## సరిహద్దులో సైన్యాన్ని మోహరిస్తున్న పాకిస్థాన్!



**పాకిస్థాన్ తన సరిహద్దులో భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు గగనతల రక్షణ, ఫిరంగి వ్యవస్థలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.**

ఈ కబురు: పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే పాకిస్థాన్ తన సరిహద్దులో భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు గగనతల రక్షణ, ఫిరంగి వ్యవస్థలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. రాజస్థాన్‌లోని బాడ్‌మెర్‌లోని లాంగేవాలా సెక్టార్‌కు అటువైపు ఉన్న ప్రాంతంలో రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను పాక్ అప్రమత్తం చేసినట్లు సమాచారం.

» 3లో

## పహల్గాం ఉగ్రదాడిలో మృతులకు అమరవీరుల హోదా ఇవ్వాలి : రాహుల్ గాంధీ

**ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి అమరవీరుల హోదా కల్పించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు.**

ఈ కబురు,దిల్లీ: ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి అమరవీరుల హోదా కల్పించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు.

» 3లో



మొదటి పేజీ తరువాయి

# తెలంగాణలో కొత్త పాలసీ.. వారికే లబ్ధి.. సీఎం రేవంత్ ప్రకటన..




అయినా పేదలు మరింత నిరుపేదలుగా మారారు. కేసీఆర్ కుటుంబానికి మాత్రం టీవీలు, దినపత్రికలు, ఫాంహౌస్‌లు, వ్యాపారాలు.. ఇలా వివిధ రూపాల్లో రూ.వేల కోట్ల ఆదాయం వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేస్తే.. అందులో రూ.1.52 లక్షల కోట్లు ఆయన (కేసీఆర్) చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే పోయింది. కార్మిక సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. అసంఘటిత కార్మికుల కోసం గిగ్ వర్కర్స్ పాలసీని త్వరలో తీసుకురాబోతున్నాం. దేశానికే రోల్ మోడల్‌గా నిలవనుంది.

కేసీఆర్ మాటలకు మోసపోవద్దు
కేసీఆర్ హయాంలో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడి నుంచి కుప్పలుగా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని మాకు అప్పగించారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే మూడేళ్లకే కూలిపోయింది. మనం ఇల్లు కట్టుకున్నా సుమారు 50 ఏళ్ల వరకు ఉంటుంది. చిన్న గుడిసె వేసుకున్నా పదేళ్లు ఉంటుంది. మళ్లీ ఇప్పుడు కపట నాటక సూత్రధారి మాదిరిగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. ఆయన మాటలు నమ్మి మోసపోవద్దు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులతో కూడా ఫోన్‌లో మాట్లాడుకోలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు మేం స్వేచ్ఛ, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.

ఆర్టీసీ కార్మికులూ.. పంతాలు వద్దు
మేం అధికారంలోకి వచ్చాక అప్పుల్లో ఉన్న ఆర్టీసీని లాభాల వైపు నడిపిస్తున్నాం. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తామని నోటీసులు ఇస్తున్నారు. మీకు(కార్మికులకు) నేను విజ్ఞప్తి చేస్తున్నా.. సమ్మె ఆలోచన వద్దు. ఈ సంస్థ మీది. రాజకీయ ప్రోత్సాహంతో సమ్మెకు వెళ్తే సంస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. పంతాలు, పట్టింపులకు పోవద్దు. ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్నాం. మరో ఏడాది అయితే కుదురుకుంటాం. ఏవైనా డిమాండ్లు ఉంటే మంత్రితో మాట్లాడండి. చేయగలిగేది ఏదైనా ఉంటే తప్పకుండా చేస్తాం. వచ్చే ఆదాయాన్ని ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచించండి. పైసా కూడా నేను ఇంటికి తీసుకువెళ్లను. అవినీతికి పాల్పడను. మీ కోసమే ఖర్చు చేస్తా. ప్రభుత్వాన్ని సమ్మెలు, ఇతర కారణాలతో నష్టపరచవద్దు. గ్రామాల్లో ఎవరికైనా ఆరోగ్యం బాగాలేనప్పుడు పత్యం చేయాలని చెబుతుంటారు. ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యం కూడా బాగాలేదు. మీరు మద్దతిస్తేనే ఈ ప్రభుత్వం ఏర్పడింది. మీలో ఒక కుటుంబ సభ్యుడిగా చెబుతున్నా. కార్మికుల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం. కష్టమైనా ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది'' అని సీఎం అన్నారు. అనంతరం పలు యాజమాన్యాలకు, కార్మికులకు శ్రమశక్తి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, కాలె యాదయ్య, శంకర్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, కనీస వేతనాల బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కులగణనలో దేశానికే ఆదర్శం. కాంగ్రెస్ విజయం

మొదటి పేజీ తరువాయి



రాహుల్‌గాంధీ పోరాటం చేయడం వల్లే...
యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు ఒక ప్రయత్నంగా జనగణనలో కులగణన చేసినా, ఆ వివరాలకు మోదీ సర్కారు ఆమోదం చెప్పలేదు. రాహుల్‌గాంధీ పోరాటం చేయడంతో... కేంద్రం ఇప్పుడు నిర్ణయం తీసుకుంది. రాహుల్ ఆలోచన అమలు చేసేందుకు ఎవరితోనైనా కలిసి పనిచేసేందుకు సిద్ధం. కులాల లెక్కలతో సంక్షేమ పథకాలు మెరుగ్గా అమలవుతాయి. కేంద్రం కులగణన చేస్తే ఆ డేటా ప్రామాణికమవుతుంది. ఏ డేటా లేకుంటే రాష్ట్రాలు సేకరించిన డేటా ప్రామాణికం. రాజ్‌నాథ్‌సింగ్ కులగణన చేపట్టబోమని అఫిడవిట్ దాఖలు చేశారు మొన్నటి వరకు భాజపా నేతలు కులగణనకు వ్యతిరేకంగా మట్లాడారు. రాజ్‌నాథ్‌సింగ్ సుప్రీంకోర్టులో కులగణన చేపట్టబోమని అఫిడవిట్ దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దయ్యేవి. రాజ్యాంగాన్ని మార్చేవారు. ఎన్నికల్లో ప్రజలు తిప్పికొట్టి 240 సీట్లు ఇచ్చారు. సంకీర్ణ ప్రభుత్వంలో అనుకున్న ఎజెండా అమలు చేయలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క కాంగ్రెస్ ఒత్తిడి పెరిగింది. దీంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు, రాజకీయ అవసరాల కోసం కులగణన చేపడతామని ప్రకటించాల్సి వచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చే రాష్ట్రాల్లో కులగణన చేస్తామని భారత్ జోడో యాత్రలో రాహుల్ హామీ ఇచ్చారు. ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో పూర్తి చేసి, దేశానికి మార్గదర్శకంగా నిలిచింది. రాహుల్‌గాంధీ కూడా ఇదే పేర్కొన్నారు. జనగణనలో కులగణన తక్షణమే చేపట్టాలని.. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి పెంచి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి బిల్లు, తీర్మానం పంపించాం. సర్వేపై మొత్తం వివరాలిచ్చాం. సున్నితమైన వివరాలు ఇవ్వలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గల్లీ నుంచి దిల్లీలోని జంతర్ మంతర్ వరకు పోరాటం చేశాం. జంతర్‌మంతర్ వద్ద చేసిన ధర్నాకు మోదీ, ఎన్డీఏ మిత్రపక్షాలు మినహా అందరూ మద్దతు తెలిపి, తెలంగాణ నిర్ణయాన్ని స్వాగతించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించడం కోసం ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం. బలహీనవర్గాలకు మేలు జరగాలన్నదే కాంగ్రెస్‌పార్టీ సంకల్పం. జనగణనలో కులగణన చేయాలని తెలంగాణ రాసిన లేఖను నమ్మి ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారు.

స్థానిక భాజపా నాయకులకు అసూయ, అసంతృప్తి
రేవంత్‌రెడ్డి విధానాలను ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తున్నారని ఇక్కడి స్థానిక భాజపా నాయకులకు అసూయ, అసంతృప్తి ఉంది. కులగణనతో దేశ ప్రజలకు మేలు జరుగుతుంది. ఏ ఒత్తిడితో నిర్ణయం తీసుకున్నా బలహీనవర్గాలకు న్యాయం, లబ్ధి జరగాలి. కేంద్ర నిర్ణయాన్ని ఎన్నికలకు, రాజకీయాలకు ముడిపెట్టడం లేదు. మాపై విమర్శలు చేసే నాయకుల్ని ఒకటే మాట అడుగుతున్నాం. గుజరాత్‌లో 25 ఏళ్లుగా అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేసి ఉంటే.. తెలంగాణ మోడల్ అనుసరించాలని చెప్పే ఆలోచన మాకు వచ్చేదా? కేంద్రం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలికులగణన కోసం కేంద్రం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలి. అనుభవజ్ఞులైన అధికారులతో నిపుణుల కమిటీ వేసి, అన్ని రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలి. కులగణనలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలు అధిగమించేందుకు ముందుగానే కేంద్రం రాజకీయపార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఉదాహరణకు తెలంగాణలో బోయ వర్గం బీసీ జాబితాలో ఉంటే.. కర్ణాటకలో ఎస్టీలుగా ఉన్నారు. లంబాడా వర్గం తెలంగాణలో ఎస్టీలుగా ఉంటే.. మహారాష్ట్రలో బీసీలుగా ఉన్నారు. కులగణన కోసం వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు నమూనాలు (ప్రొఫైల్స్) తీసుకోవాలి. మేము సర్వేలో పాల్గొన్న ప్రజల వ్యక్తిగత సమాచారం బయటకు రాకుండా డేటా ప్రైవసీ చట్టాన్ని చేశాం.
కులగణన ఎక్స్‌రే లాంటిది..కులగణనలో కేంద్రం సాధారణ సమాచారం తీసుకుంటే ఎలాంటి ఉపయోగం లేదు. వాస్తవానికి ఇది సమస్యలు పరిష్కరిచేందుకు సమాజానికి నిర్వహించే ఒక ఎక్స్‌రే లాంటిదని రాహుల్‌గాంధీ అన్నారు. సర్వే డేటాతో ఏం చేయాలన్నది పెద్ద సవాల్. అందుకే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, కంచ ఐలయ్య, శాంతాసిన్హా లాంటి నిపుణులతో కమిటీ వేసి, బలహీనవర్గాలకు విద్య, ఉపాధి, బడ్జెట్‌లో వారికి హక్కు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. సుప్రీంకోర్టు 50 శాతమే రిజర్వేషన్లు ఉండాలని చెప్పలేదుఈడబ్ల్యూఎస్‌తో ఇప్పటికే రిజర్వేషన్లు 60 శాతానికి చేరాయి.సుప్రీంకోర్టు 50 శాతమే రిజర్వేషన్లు ఉండాలని చెప్పలేదు. స్పష్టమైన సమాచారం, గణాంకాలు ఉంటే అంతకు మించి ముందుకు వెళ్లవచ్చు. జనగణనలో కులగణన వివరాలు స్పష్టంగా వస్తే రిజర్వేషన్లు పెంచుకోవచ్చు'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కగార్ ఆపరేషన్‌పై మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం, పార్టీ హింసకు వ్యతిరేకం. చర్చలు జరగాలన్నదే మా అభిమతం' అని అన్నారు.

రాహుల్‌గాంధీని నరేంద్రమోదీ ఆదర్శంగా తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. మహాత్మాగాంధీ తరహాలో రాహుల్‌గాంధీ ఈ దేశానికి ఏది కావాలో ముందుగానే గుర్తించి దానిని సాధించేవరకు వదిలిపెట్టరు.
రాష్ట్ర భాజపా నాయకులు గల్లీ నాయకులు.. రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి విధానాలను మోదీ అనుసరిస్తున్నారన్న బాధ వారిలో కనిపిస్తోంది.
సీఎం రేవంత్‌రెడ్డిసీఎంకు మంత్రులు, బీసీ సంఘాల అభినందనలు
సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తూ పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కె.కేశవరావు, మాజీ ఎంపీ హనుమంతరావు. చిత్రంలో నిర్మలా జగ్గారెడ్డి, గద్వాల విజయలక్ష్మి, గుండు సుధారాణి, శంకరయ్య, జాజుల, మధుయాస్కీ, అంజన్‌కుమార్, ఆది శ్రీనివాస్, అయిలయ్య, షబ్బీర్ అలీ

ఈ కబురు, హైదరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీ కులగణన చేసి.. ఆమోదం కోసం కేంద్రానికి పంపించి.. తద్వారా కేంద్ర ప్రభుత్వం కూడా అనివార్యంగా కులగణనను దేశవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన కృషి అమోఘమని బీసీ సంఘాలు కొనియాడాయి. కేంద్రంపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలితంగానే జాతీయ స్థాయిలో కులగణన నిర్వహణకు మార్గం సుగమమైందని అభినందిస్తూ.. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నేతలు గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలతో ముంచెత్తారు. సీఎంకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ముఖ్యమంత్రిని అభినందించిన వారిలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, శంకరయ్య, మక్కన్‌సింగ్ ఠాకూర్, వాకిటి శ్రీహరి, సంజయ్, ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మ, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, మధుయాస్కీ, గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ సంఘాల నాయకులు తదితరులున్నారు.

గాంధీభవన్‌లో సంబరాలు..
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన విధంగా దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నాయి. ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్‌ల ఆధ్వర్యంలో గురువారం గాంధీభవన్‌లో వేర్వేరుగా సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.
నేడు దిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి
ఈ కబురు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం దిల్లీకి వెళ్లనున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో సీఎం పాల్గొంటారు. ఆయనతో పాటు తెలంగాణ నుంచి సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర రాజనర్సింహ, చల్లా వంశీచంద్‌రెడ్డి కూడా పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో.. శుక్రవారం నాటి సీడబ్ల్యూసీ భేటీలో ప్రధానంగా ఈ అంశంపై చర్చించనున్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఇండియాను సృజనాత్మక కేంద్రంగా మారుస్తాం.. ప్రధాని మోడీ



మానవులను రోబోలుగా మార్చొద్దు
నిరంతరం అభివృద్ధి చెందుతున్న సాంకేతికత ప్రజల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ టైంలో మానవ సున్నితత్వాన్ని కాపాడుకోవడానికి అదనపు కృషి అవసరమని నొక్కి చెప్పారు. మానవులను రోబోలుగా మార్చొద్దని, వారిని మరింత సున్నితంగా మార్చాలన్నారు. మానవత్వ వ్యతిరేక ఆలోచనల నుండి యువతరాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. నిజమైన మానవ పురోగతిని సాంకేతికత, సమాచారం లేదా వేగం ద్వారా మాత్రమే కొలవలేమన్నారు. క్రియేటివిటీ ఉన్న వ్యక్తులు తమ శక్తి సామర్థ్యంతో సృజనాత్మక మార్పునకు నాయకత్వం వహించాలన్నారు. భారత్‌ను ప్రపంచ సృజనాత్మక కేంద్రంగా మార్చడంతో తోడ్పడాలని సూచించారు.

భవిష్యత్‌లో వేవ్స్ అవార్డులు
కళలు, సృజనాత్మకత రంగంలో భవిష్యత్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన వేవ్స్ అవార్డులు ప్రారంభిస్తామన్నారు. వేవ్స్ అనేది కేవలం సంక్షిప్త రూపం కాదని కల్చర్, క్రియేటివిటీలకు సార్వత్రిక అనుసంధానం అని కొనియాడారు. యువత కొత్త ఆలోచనలతో ఒక దగ్గర చేరే చోటు అని ప్రశంసించారు. భారత్ చలనచిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, సంగీతం, ప్రత్యక్ష కచేరీలకు ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, కాబట్టి పెట్టుబడిదారులు అందులో ఇన్వెస్ట్ మెంట్స్ ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో 10,000 మందికి పైగా ప్రతినిధులు, 1,000 మంది క్రియేటర్లు, 300 కంపెనీలు,350 స్టార్టప్‌లు పాల్గొన్నాయి.


# పాలమూరు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ వేగవంతంగా పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంట రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల పనులను ప్రగతిని ప్రొజెక్టర్ ద్వారా మంత్రులకు ఇంజనీరింగ్ అధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... గతానికి పోతే దురదృష్టకరం ఎం జి కే ఎల్ ఐ నెట్టంపాడు బీమా కోయిల్ సాగర్ ప్రాజెక్టుల పనులు చాలా అడ్వాన్స్ స్టేజిలో ఉండి కూడా గత ప్రభుత్వంలో పదేళ్లపాటు పూర్తికాలేదని విచార వ్యక్తం చేశారు. గతంలో నుంచి కూడా ఈ నాలుగు ప్రయాణం ప్రాజెక్టులన్నింటినీ సంపూర్ణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 2026 మార్చి 31 వరకు అన్ని విధాలుగా 100% పూర్తి చేయడానికి ఆ దిశగా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి వెల్లడించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులు ఏమేం చర్యలు చేపట్టాలో సమీక్ష సమావేశం లో చర్చించనున్నట్లు మంత్రి చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనీ ప్రాజెక్టుల పనులను పకడ్బందీగా ప్రణాళికబద్ధంగా వేగవంతంగా పూర్తి చేసి రైతులకు వినియోగంలోకి తీసుకురానున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.
ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు చెప్పిన విధంగా ఎం జి కే ఎల్ ఐ ప్రాజెక్టు మొదటి లిఫ్టులో నిరుపయోగంగా ఉన్న రెండు మోటార్లను రెండు మూడు నెలల్లో మరమ్మతులు పూర్తి చేసి వినియోగం లోకి తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు. అన్ని ప్రాజెక్టుల్లో ఎక్కడెక్కడ భూసేకరణ వారండార్ ప్యాకేజీలను లిస్ట్ అవుట్ చేసుకోవడానికి ఏ విధంగా బడ్జెట్ కేటాయించి విడుదల చేసుకోవాలో తమ ప్రాజెక్టుల పర్యటన దోహదపడుతుందని మంత్రి అన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నింపడానికి 2026 మార్చి నెలాఖరికి ఏ విధంగా ముందుకు పోవాలో ప్రణాళిక రూపొందించుకొని ముందుకెళ్తామని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి తెలిపారు. అనంతరం కొల్లాపూర్ నియోజకవర్గం లోని కోడేరు మండలం తీగలపల్లి వద్ద (ఎదుల) రెండో లిఫ్ట్ లో పంపింగ్ స్టేషన్, పంప్ హౌస్ సొరంగం కాల్వల పనులను పరిశీలించారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. వీరి వెంట నీటి పారుదల శాఖ ప్రభుత్వ సలహాదారు, రిటైర్డ్ ఇంజనీర్ పెంటారెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్, డిసిసిబి ఉమ్మడి జిల్లా చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, ఈఎన్సీ అనిల్ కుమార్ ఎస్సీ సత్యనారాయణ, ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు. అయితే నాలాపూర్ రిజర్వాయర్ హెలిప్యాడ్ వద్ద మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, చిన్నారెడ్డిలకు అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు.

# 'ఏ ఒక్కరినీ వదిలిపెట్టం'.. పహల్గాం ఘటనపై అమిత్ షా



''దశాబ్దాలుగా కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న వారిపై మోదీ ప్రభుత్వం బలంగా పోరాడుతోంది. పౌరుల ప్రాణాలను తీయడం ద్వారా యుద్ధంలో గెలిచామని ఉగ్రమూకలు భావించడం పొరపాటే అవుతుంది. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తున్న వారందరికీ ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాం. ఇది యుద్ధం ముగింపు కాదు. ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. ప్రతి ఒక్కరికీ తగిన విధంగా సమాధానం చెబుతాం'' అని అమిత్ షా హెచ్చరించారు.

మొదటి పేజీ తరువాయి

# కులగణనలో తెలంగాణది రాంగ్ మోడల్



అనుకూలంగా భాజపా 2010లోనే తన వైఖరి చెప్పింది. నాడు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ తాము ఇందుకు అనుకూలంగానే ఉన్నామని, 2011 జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలని అప్పటి ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీకి లేఖ రాశారు. కాంగ్రెస్ మాత్రం ఆ అంశాన్ని పక్కనపెట్టి 2011లో కేవలం జనగణన మాత్రమే చేసింది'' అని వివరించారు. మోదీ సర్కారు బీసీలకు అనుకూలంగా తీసుకున్న కులగణన నిర్ణయాన్ని తమ ఘనత అన్నట్లు రాహుల్ గాంధీ చెప్పుకోవడం సిగ్గుచేటు అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ''మా ప్రభుత్వం దేశానికి, సమాజానికి జరిగే మేలును దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటుంది తప్ప, రాహుల్ గాంధీకో, కాంగ్రెస్ పార్టీకో భయపడి కాదు. కులగణన ద్వారా ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలను బీసీల్లో చేర్చబోం. మత ప్రాతిపదికన ఎవరినీ బీసీల్లో చేర్చే ప్రసక్తే ఉండదు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కులగణనను ఒక తంతుగా చేశారు తప్ప, అందులో శాస్త్రీయత లేదు. అది కులగణన కాదు. కేవలం సర్వే మాత్రమే. తెలంగాణలో కనీసం 50% ఇళ్ల నుంచి కూడా వివరాలు సేకరించలేదు. మా ఇంటికి ఎవరూ వచ్చి వివరాలు సేకరించలేదు. తెలంగాణ కులగణన విషయంలో రోల్ మోడల్ కాదు... రాంగ్ మోడల్. అది మాకు అవసరం లేదు. రేవంత్ సర్కారు చేసింది బీసీ వ్యతిరేక సర్వే. ముస్లింలను బీసీల్లో చేర్చడానికి నిర్వహించిన ఆ సర్వే ద్వారా అసలైన బీసీలకు తీరని అన్యాయం జరిగింది.
సెన్సస్ యాక్ట్ 1948లో సవరణ చేయాలి
స్వాతంత్ర్యానంతరం అత్యధిక కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకూ ఎందుకు కులగణన చేయలేకపోయిందో దేశానికి సంజాయిషీ చెప్పాలి. ఇప్పుడు కులగణన చేయాలంటే సెన్సస్ యాక్ట్ 1948లో సవరణ చేయాలి. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ సవరణ తీసుకొచ్చాకే కేంద్రం జనగణనపై ముందుకెళ్తుంది. 2026లో జనాభా లెక్కలు ప్రచురించిన తర్వాతే దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని రాజ్యాంగంలో చెప్పినందున దాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెడుతుంది. బహుశా 2026 జనవరి తర్వాత జనాభా లెక్కల సేకరణ ప్రారంభం కావొచ్చు. తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటి మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. కులగణన ఘనత తమదే అని అంటే ఎవరూ నమ్మేవాళ్లు లేరు. తెలుగు ప్రజలు, దేశ ప్రజలు కాంగ్రెస్, భారాసలను నమ్మడం లేదు. ఆ రెండు పార్టీలకు ఏనాడూ బీసీలకు సంబంధించిన అంశాల్లో, రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేదు'' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# చివరి మజిలీలో మహాప్రస్థానం సిబ్బంది సేవలు ఆదర్శం : కొమిరిశెట్టి సాయిబాబా

### మే డే సందర్భంగా మహాప్రస్థానం సిబ్బందికి సన్మానం

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రతి మనిషి ఆఖరి గమ్యం చావు అని, చివరి మజిలీ కోసం మహాప్రస్థానం సిబ్బంది చేస్తున్న సేవలు ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. కార్మికుల దినోత్సవ వేడుకలను రాయదుర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా రాయదుర్గం మహాప్రస్థానంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను సాయిబాబా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్మికులకు బహుమతులు, స్వీట్ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమానికి గుర్తుగా మే డే వేడుకలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మికులను సంఘటితం చేసే ఏకైక పండుగ కార్మికుల దినోత్సవం అని అన్నారు. మే డే వేడుకలను పురస్కరించుకుని రాయదుర్గం మహాప్రస్థానం సిబ్బందిని సన్మానించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కారోనా మహమ్మారి కారణంగా ప్రపంచమంతా భయాందోళన మధ్య ఉన్న సమయంలో మహాప్రస్థానం ఉద్యోగులు చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. సొంత మనుషులు సైతం దగ్గరికి వచ్చేందుకు భయపడుతున్న సమయంలో మహాప్రస్థానం ఉద్యోగులు ముందుకు వచ్చి, మరణించిన వారి చివరి మజిలీని సంప్రదాయబద్ధంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మహాప్రస్థానం మేనేజర్ రాజ్ కుమార్, మహా ప్రస్థానం సిబ్బంది, స్థానిక నాయకులు అంజమ్మ, దారుగుపల్లి నరేష్, రమేష్ గౌడ్, శామ్లెట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహాప్రస్థానం ఉద్యోగులను సన్మానిస్తున్న సాయిబాబా



మే డే వేడుకల్లో కార్మికులతో కలిసి సాయిబాబా

# సీపీఎం ఆధ్వర్యంలో చందానగర్ లో కార్మిక దినోత్సవ వేడుకలు



కార్మిక దినోత్సవ వేడుకల్లో జెండా అవిష్కరిస్తుటున్న నాయకులు



కార్మికులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

### సీపీఎం ఆధ్వర్యంలో చందానగర్ లో కార్మిక దినోత్సవ వేడుకలు చికాగో అమరవీరులకు నివాళి

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చందానగర్ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చందానగర్ సబ్ స్టేషన్ వద్ద జెండా ఆవిష్కరించి, చికాగో పోరాటంలో మృతిచెందిన అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జగదీష్, జిల్లా నాయకులు చల్లా శోభన్, సిఐటియు శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ లు మాట్లాడుతూ కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం రావాలని 1886లో అమెరికాలోని చికాగో నగరంలో గల హే మార్కెట్లో జరిగిన వీరోచిత పోరాటానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా కార్మిక దినోత్సవ వేడుకలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. నాటి కార్మికుల ఉద్యమం మీద ఉక్కుపాదం మోపిన కార్మికుల మీద దాడి చేసి ఎంతోమంది కార్మికులను పొట్టన పెట్టుకున్నారని అన్నారు. కార్మికుల రక్తం ఏరులై పారగా, అక్కడి రక్తం మడుగులో నుంచి మహిళలు తీసిన జెండానే ఎర్రజెండాగా ఆవిర్భవించిందని అన్నారు. నాటి నుంచి నేటి వరకు మే డేను ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా కార్మికులంతో కలిసి జరుపుకుంటున్నారని అన్నారు. కార్మికుల హక్కులను కాపాడాలని, శ్రమకు తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, జిహెచ్ఎంసి వర్కర్స్ అంగన్వాడీ టీచర్లతో పాటు రమేష్ రెడ్డి ఆంజనేయులు క్రాంతి కిరణ్ నాగమణి సువర్ణ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పహల్గాం ఉగ్రదాడిలో మృతులకు అమరవీరుల హోదా ఇవ్వాలి : రాహుల్ గాంధీ

ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఉగ్రదాడిలో మృతి చెందినవారి కుటుంబ సభ్యుల్ని ఆయన కాన్పుర్‌లో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్న రాహుల్ గాంధీ.. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అమరవీరుల హోదా కల్పించాన్న బాధిత కుటుంబాల డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.
జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన పాశవిక దాడిలో తమ వారిని పోగొట్టుకొని విషాదంలో ఉన్న కుటుంబాల మనోభావాలను గౌరవించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. శుభం ద్వివేది కుటుంబ సభ్యుల్ని కలిసిన అనంతరం రాహుల్‌మీడియాతో మాట్లాడుతూ.. పహల్గాం ఘటనలో బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకు ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కేంద్రాన్ని కోరుతున్నాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26మంది మృతి చెందగా.. వీరిలో ఎక్కువ మంది పర్యాటకులే ఉన్న విషయం తెలిసిందే.

# ప్రధానిగా మన్మోహన్ ఎప్పుడూ పాకిస్థాన్ వెళ్లలేదు..



### మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తన పదవీకాలంలో ఎప్పుడూ పాకిస్థాన్‌ను సందర్శించలేదని కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ గుర్తుచేశారు.

ఈ కబురు: పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తన పదవీకాలంలో ఎప్పుడూ పాకిస్థాన్ ను సందర్శించలేదని, ఆ దేశానికి వెళ్లడం సరికాదని ఆయన భావించారన్నారు. రాజకీయ జీవితంలో దేశానికే తొలి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. దిల్లీలో నిర్వహించిన మన్మోహన్ సింగ్ సంస్మరణ కార్యక్రమంలో సచిన్ పైలట్ ఈ మేరకు ప్రసంగించారు. యూపీయే2 హయాంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేసిన తనను మంత్రివర్గంలో సమాన సభ్యుడిగా చూసుకున్నారని చెప్పారు.
''ప్రధానిగా ఉన్నప్పుడు మన్మోహన్ పాకిస్థాన్‌కు వెళ్లలేదు. అక్కడి తన స్వగ్రామాన్ని సందర్శించలేదు. ఆయన్ను ఎవరు ఆపారు? అని రాజీవ్ శుక్లా అడిగారు. వాస్తవానికి చాలాసార్లు ఆహ్వానం అందినప్పటికీ.. వెళ్లడం సరైంది కాదని భావించి వెళ్లలేదు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే ఆడ్వాణీ, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీలు దాయాది దేశ పర్యటనకు వెళ్లారు. కానీ, సోనియా గాంధీ, మన్మోహన్ మాత్రం దూరంగా ఉన్నారు. 'దేశమే ముందు' అని చెప్పడం సులభమే. కానీ, ఆ మాటపై నిలబడటం కష్టం. ఆయన మాత్రం తన రాజకీయ జీవితంలో ఈ సూత్రానికి కట్టుబడి ఉన్నారు'' అని సచిన్ పైలట్ తెలిపారు.
''భారత్ అణుశక్తిగా ఎదగడంలో మన్మోహన్‌కు చాలావరకు క్రెడిట్ దక్కుతుంది. ఈ వ్యవహారంలో ఆయన తన ప్రభుత్వాన్ని ఫణంగా పెట్టారు. అమెరికాతో అణు ఒప్పందం దేశానికి మంచిదని



భావించారు. తన పదవీకాలంలో సామ్యవాద విధానాలను ప్రవేశపెట్టారు. రుణమాఫీ, ఉపాధిహామీ పథకం, పేదరిక నిర్మూలన వంటి వాటిని ప్రజలు మర్చిపోకూడదు'' అని సచిన్ పైలట్ అన్నారు. ముంబయి దాడుల అనంతరం పాక్‌పై మన్మోహన్ సింగ్ కూడా చర్యలు తీసుకున్నారని, కానీ.. ప్రచారం చేసుకోలేదని రాజీవ్ శుక్లా అన్నారు. ఇదిలా ఉండగా.. మన్మోహన్ సింగ్ (92) గతేడాది డిసెంబర్ 26న తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే

# రిజర్వేషన్లు 68 శాతానికి పెంచాలి: ఖర్గే డిమాండ్



### దేశంలో రిజర్వేషన్లను 68 శాతానికి పెంచాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ఈ కబురు,హుబ్బళ్లి: దేశంలో రిజర్వేషన్లను 68 శాతానికి పెంచాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రాన్ని డిమాండ్ చేశారు. త్వరలో చేపట్టబోయే జనాభా లెక్కల సేకరణతోపాటు కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని 68 శాతానికి పెంచాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా హుబ్బళ్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ''రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం..దేశాన్ని కాపాడుకుందాం'' అనే పేరుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. కేంద్రం తొలుత కులగణన చేపట్టడానికి ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ఒత్తిడి వల్ల దేశవ్యాప్తంగా కులగణనకు అంగీకరించింది. ఈ మేరకు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి తమిళనాడు ప్రభుత్వం అందిస్తున్న విధంగా 68 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నా. కేంద్రం 2021లోనే కులగణనను ఎందుకు చేపట్టలేదో చెప్పాలి? అప్పుడే కులగణన చేసి ఉంటే.. పౌరుల స్థితిగతులు, వారి తలసరి ఆదాయం, జీతాలు, ఉద్యోగాల సంఖ్య, పేదరికంలో ఉన్న వారి వివరాలు మనకు తెలిసేవి'' అని వ్యాఖ్యానించారు. భాజపా ప్రభుత్వం నిష్పక్షపాతంగా, పకడ్బందీగా మూడు నెలల్లోనే కులగణనను పూర్తి చేయాలి.. అలా చేస్తేనే కేంద్రానికి కులగణనపై ఆసక్తి ఉన్నట్లుగా భావిస్తామని ఖర్గే పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?



పహల్గాం ఘటనపై విచారణకు సుప్రీం తిరస్కరణ
పహల్గాం ఘటనపై న్యాయ విచారణకు దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇది చాలా క్లిష్ట సమయం అని పేర్కొంది.
ఈ కబురు: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ముష్కరులు జరిపిన పాశవిక దాడితో యావత్ దేశం ఉలిక్కిపడింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని దేశమంతా ఒక్కటైంది. ఈ నేపథ్యంలో పహల్గాం దాడి పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని కోర్టు పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ''ఇది చాలా క్లిష్ట సమయం. ఉగ్రవాదంపై పోరులో ప్రతి పౌరుడు చేతులు కలపాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కాస్త బాధ్యతతో వ్యవహరించండి. అందులో సున్నితత్వాన్ని అర్థం చేసుకోండి. ఇలాంటి చర్యలతో మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? మీక్కూడా దేశంపై బాధ్యత ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు'' అని ధర్మాసనం సూచించింది.
''ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దు. ఉగ్రవాద ఘటనల విచారణకు జడ్జీలు నిపుణులు కారు'' అని ధర్మాసనం వెల్లడించింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థుల కోసమే అయితే హైకోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. కోర్టు సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో ఓ కశ్మీరీ సహా 26 మంది ప్రాణలు కోల్పోయారు. ఈ దాడితో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి గట్టిగా బదులిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది

# సరిహద్దులో సైన్యాన్ని మోహరిస్తున్న పాకిస్థాన్!



పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ ప్రస్తుతం మూడు సైనిక విన్యాసాలను ఒకేసారి నిర్వహిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎఫ్16, ఎఫ్10, ఎఫ్17 తదితర యుద్ధ విమానాలతో వీటిని కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఏప్రిల్ 29 నుంచి ఇవి మొదలయ్యాయని, ఇందులో సాబ్ ఎయిర్‌బోర్న్ వార్నింగ్‌కంట్రోల్ సిస్టమ్‌లతో కూడిన విమానాలూ ఉన్నట్లు తెలిసింది.

వైమానిక స్థావరాల భద్రత సహా క్షేత్రస్థాయి ఆస్తుల రక్షణ కోసం ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ ఫోర్స్‌ను పాకిస్థాన్ మోహరించింది. చైనాకు చెందిన ఎస్‌హెచ్ 15 శతఘ్నులను పాక్ ఆర్మీ సమకూర్చుకోగా.. వాటిని ప్రస్తుతం సరిహద్దుకు తరలిస్తున్నట్లు తెలిసింది.

ఇదిలాఉంటే, పహల్గాం ఉగ్రదాడులకు ప్రతీకారం తప్పదని భారత్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రక్షణ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ ఇటీవల సమీక్ష నిర్వహించారు. దీంతో తమపై భారత్ ఏ క్షణమైనా దాడులకు పాల్పడవచ్చని పాక్ మంత్రులు అనుమానాలు వ్యక్తం

# బంగారమా..? మాకొద్దు బాబోయ్..!



**పసిడి డిమాండ్ 15% డౌన్**
**మార్చి త్రైమాసికంలో 118 టన్నులు నమోదు**
**విలువ పరంగా 22 శాతం అప్..**
**ఈ ఏడాది 700–880 టన్నుల డిమాండ్**
**ప్రపంచ స్వర్ణ మండలి అంచనా**

బంగారం డిమాండ్ ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో (మార్చి త్రైమాసికం) 15 శాతం తగ్గి 118.1 టన్నులుగా ఉంది. విలువ పరంగా క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే మాత్రం 22 శాతం వృద్ధితో రూ.94,030 కోట్లుగా నమోదైంది. ఈ వివరాలను వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) విడుదల చేసింది. 202526లో భారత్ నుంచి పసిడి డిమాండ్ 700-800 టన్నుల మేర ఉండొచ్చని అంచనా వేసింది.

'ధరలు పెరగడంతో కొనుగోలు శక్తిపై ప్రభావం పడింది. అయినప్పటికీ సాంస్కృతికంగా ఉన్న ప్రాధాన్యం.. అక్షయ తృతీయకుతోడు వివాహాల సీజన్ కావడంతో కొనుగోళ్లకు డిమాండ్ కొనసాగుతోంది' అని డబ్ల్యూజీసీ ఇండియా సీఈవో సచిన్ జైన్ మార్చి త్రైమాసిక నివేదికలో తెలిపారు. ధరలు గణనీయంగా పెరిగిపోవడంతో వినియోగదారులు లైట్ వెయిట్ ఆభరణాల కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు జ్యుయలర్లు చెబుతున్నారు. ముఖ్యంగా మే చివరి వరకు వివాహాలు ఉండడం, భారతీయ సంస్కృతిలో బంగారం ఆభరణాలకు ఉన్న ప్రాధాన్యంతో కొనుగోళ్లకు డిమాండ్ కొనసాగొచ్చని అంచనా వేస్తున్నారు.

పసిడిపై జోరుగా పెట్టుబడులు

ఇక ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో బంగారంపై పెట్టుబడులకు డిమాండ్ కొనసాగింది. క్రితం ఏడాది మొదటి మూడు నెలలతో పోల్చి చూస్తే 7 శాతం అధికంగా 46.7 టన్నులుగా నమోదైంది. క్రితం ఏడాది మొదటి త్రైమాసికంలో పసిడి పెట్టుబడుల డిమాండ్ 43.6 టన్నులుగా ఉంది. అంతర్జాతీయంగా భౌగోళిక, వాణిజ్య ఉద్రిక్తతలతో ఈక్విటీ మార్కెట్లు ఆటుపోట్లను చూస్తున్న తరుణంలో.. ఇన్వెస్టర్లు పెట్టుబడులకు సురక్షిత సాధనంగా బంగారాన్ని పరిగణిస్తుండడం ఇందుకు నేపథ్యంగా ఉంది.

**ఆభరణాల డిమాండ్‌లోనూ క్షీణతే..**

ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో బంగారం ఆభరణాల డిమాండ్ క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 25 శాతం తగ్గి 71.4 టన్నులుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 95.5 టన్నులుగా ఉంది. 2020 నుంచి చూస్తే ఒక ఏడాది మొదటి త్రైమాసికంలో కనిష్ట ఆభరణాల డిమాండ్ ఇదే కావడం గమనార్హం. క్రితం ఏడాది మొదటి క్వార్టర్‌తో పోలిస్తే ఆభరణాల కొనుగోళ్ల విలువ 3 శాతం పెరిగింది.

**పెరిగిన దిగుమతులు**

పసిడి దిగుమతులు 8 శాతం పెరిగి 167.4 టన్నులుగా ఉన్నాయి. రీసైక్లింగ్ పరిమాణం 32 శాతం తగ్గి 26 టన్నులుగా నమోదైంది. అధిక ధరల నేపథ్యంలో వినియోగదారులు పాత ఆభరణాలను తమవద్ద ఉంచుకునేందుకు మొగ్గు చూపించడం ఇందుకు కారణం. ఇక అంతర్జాతీయంగా ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో బంగారం డిమాండ్ ఒక శాతం పెరిగి 1,206 టన్నులుగా ఉంది.

# తగ్గిన గ్యాస్ సిలిండర్ ధర



వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర తగ్గింది. 19 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ .14.50 మేర తగ్గించినట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు తెలిపాయి. తగ్గించిన కొత్త ధర మే 1 నుండి అమలులోకి వస్తుంది. మార్కెట్లో అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో గ్యాస్ ధర తగ్గడం వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగిస్తుంది. రేట్ల తగ్గింపు తరువాత, ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర ఇప్పుడు రూ .1,747.50 వద్ద ఉంది. ఇతర ప్రధాన మెట్రో నగరాల్లో సవరించిన ధరలు ముంబైలో రూ .1,699, కోల్‌కతాలో రూ .1,851.50, చెన్నైలో రూ .1,906, హైదరాబాద్‌లో 1,969 వద్ద ఉన్నాయి. స్థానిక పన్నులు, రవాణా ఛార్జీలు వంటి కారకాల వల్ల ఎల్‌పీజీ ధరలు రాష్ట్రాన్ని బట్టి మారవచ్చు. గృహావసరాలకు వినియోగించే డొమెస్టిక్, వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలు సాధారణంగా ప్రతి నెలా మొదటి రోజున సర్దుబాటు చేస్తుంటారు. ఈ మార్పు వాణిజ్య గ్యాస్ సిలిండర్లకు మాత్రమే వర్తిస్తుంది. డొమెస్టిక్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. గత నెలలో డొమెస్టిక్ సిలిండర్లపై రూ.50 పెరిగింది. రోజువారీ కార్యకలాపాల కోసం వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్లపై ఎక్కువగా ఆధారపడే హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు వ్యాపారులకు ఈ తగ్గింపు ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు.

# రూ.2.37 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు చేశారు!




గడిచిన నెలలో ప్రభుత్వానికి జీఎస్టీ వసూళ్లు రికార్డ్ స్థాయిలో వచ్చాయి. ప్రభుత్వం మే 1న విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్ నెలలో జీఎస్టీ రూపంలో రూ.2.37 లక్షల కోట్లు వసూలయ్యాయి. అంతకు ముందు నెలలో అంటే మార్చిలో రూ.1.96 లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి.

కాగా గతేడాది ఇదే నెలలో అంటే 2024 ఏప్రిల్‌లో ప్రభుత్వం రూ.2.1 లక్షల కోట్లు జీఎస్టీ కింద వసూలు చేసింది. వార్షిక వసూళ్ల వేగం 12.6 శాతంగా ఉండటం కూడా 17 నెలల్లో ఇదే గరిష్టం. ఆర్థిక వ్యవస్థకు వినియోగం తోడ్పడటంతో త్రైమాసిక వసూళ్లు 2025 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ .5.75 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

దేశీయ లావాదేవీల నుంచి జీఎస్టీ ఆదాయం 10.7 శాతం పెరిగి రూ.1.9 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకున్న వస్తువుల ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.46,913 కోట్లకు చేరింది. ఏప్రిల్‌లో రీఫండ్ల జారీ 48.3 శాతం పెరిగి రూ.27,341 కోట్లకు చేరింది.

ఇక అంతకుముందు నెలల్లో జీఎస్టీ వసూళ్లను పరిశీలిస్తే ఫిబ్రవరిలో రూ.183,646 కోట్లు, జనవరిలో రూ.1.96 లక్షల కోట్లు, డిసెంబరులో రూ.1.77 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. బడ్జెట్లో ప్రభుత్వం ఈ సంవత్సరానికి జీఎస్టీ ఆదాయంలో 11% పెరుగు

# పూర్తి కోడింగ్ పనంతా ఏఐదే!



కృత్రిమ మేధ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. దాదాపు అన్ని రంగాల్లో ఏఐ వినియోగం ఎక్కువైంది. సాఫ్ట్‌వేర్‌లోనైతే దీని వాడకం మరీ అధికం. ఇప్పటివరకు కోడింగ్ నిపుణులకు ఏఐ సాయంగా నిలుస్తుంది. అయితే రాబోయే కొన్ని నెలల్లోనే ఏఐ పూర్తి కోడింగ్ రాస్తుందని మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ అంచనా వేశారు. ఈ నేపథ్యంలో త్వరలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చే 12 నుంచి 18 నెలల్లో కృత్రిమ మేధ(ఏఐ) మెటా అంతర్గత ఏఐ ప్రాజెక్టులకు, ముఖ్యంగా దాని లామా ప్రాజెక్ట్‌ల్లో పూర్తిగా కోడింగ్ సేవలందిస్తుందని మార్క్ జుకర్‌బర్గ్ చెప్పారు. ఇప్పటికే ఈ విభాగాల్లో ఏఐ మెజారిటీ కోడ్‌ను రాస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రాజెక్ట్ లక్ష్యాలను నిర్దేశించడం, పరీక్షలను నిర్వహించడం, బగ్‌లను గుర్తించడం, కోడ్ నాణ్యతను మెరుగుపరచడం వంటి మరింత అధునాతన పనులను ఏఐ చేపడుతుందని జుకర్‌బర్గ్ భావిస్తున్నారు. కృత్రిమ మేధ త్వరలోనే ఈ రంగాల్లో ఇంజినీర్లను రిప్లేస్ చేస్తుందని అంచనా వేస్తున్నారు.

**సుందర్ పిచాయ్..**

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కూడా ఇటీవల ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రధాన టెక్ కంపెనీల్లో కృత్రిమ మేధను గణనీయంగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. గూగుల్ ఆల్ఫాకోడ్, మెటా ఏఐ నమూనాలు వాటి లార్జ్ ల్యాంగ్వేజీ మోడల్స్‌తో ఫంక్షనల్ కోడ్‌ను జనరేట్ చేయడం, దోషాలను డీబగ్గింగ్ చేయడం, పనితీరును ఆప్టిమైజ్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

**ఏఐకి అంత సీన్ లేదు..**

ఇదిలాఉండగా, ఏఐను అతిగా అంచనా వేయొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కోడింగ్‌లో ఏఐ పురోగతి మెరుగ్గానే ఉన్నప్పటికీ, హ్యూమన్ డెవలపర్లను పూర్తిగా భర్తీ చేయడం కుదరదని చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లో ఫంక్షనల్ కోడ్ రాయడం కంటే సంక్లిష్టమైన వ్యాపార అవసరాలను అర్థం చేసుకోవడం, నైతిక నిర్ణయాలు తీసుకోవడం, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా వ్యవస్థలను రూపొందించడం అవసరం అవుతుంది. ఈ పనులకు సృజనాత్మకత, సందర్భోచిత అవగాహన, డెసిషన్ మేకింగ్ ఎంతో తోడ్పడుతుంది. వీటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమర్థంగా నిర్వహించలేదనే వాదనలున్నాయి.'

# చిన్న వాటికి చిన్నవి.. ఐకియా కొత్త వ్యూహం

స్వీడిష్ హోమ్ ఫర్నీషింగ్ రిటైలింగ్ దిగ్గజం ఐకియా భారత్‌లో తన కార్యకలాపాల విస్తరణకు సంబంధించి కొత్త వ్యూహాలను పరిశీలిస్తోంది. బడా నగరాల్లో పెద్ద స్టోర్స్‌కే పరిమితం కాకుండా చిన్న పట్టణాలకు అనువుగా చిన్న ఫార్మాట్ స్టోర్స్‌ను కూడా ఏర్పాటు చేయడం ద్వారా కొనుగోలుదారులకు చేరువ కావాలని భావిస్తోంది. సుమారు 10,000 చ.అ. విస్తీర్ణంలో వీటిని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఐకియా ఇండియా కంట్రీ ఎక్స్‌పాన్షన్ మేనేజర్ పూజా గ్రోవర్ తెలిపారు.

మాల్స్‌లోనూ స్టోర్స్‌ను ఏర్పాటు చేసేందుకు, వేగంగా విస్తరించేందుకు కూడా ఈ ఫార్మాట్ ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నట్లు గ్రోవర్ వివరించారు. ఈ కొత్త కాన్సెప్ట్ విషయంలో రియల్ ఎస్టేట్ డెవలపర్లతో భాగస్వామ్యాలు కుదుర్చుకునే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. చిన్న స్టోర్స్‌లో పరిమిత స్థాయిలోనే ఉత్పత్తులను డిస్‌ప్లే చేసినా మొత్తం 7,000 ప్రోడక్టుల విస్తృత శ్రేణి నుంచి ఎంచుకునేందుకు డిజిటల్ కేటలాగ్, హోమ్ డెలివరీ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని గ్రోవర్ చెప్పారు.

ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, ముంబై వంటి ఆరు ప్రాధాన్య నగరాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వివరించారు. పదేళ్ల వ్యవధిలో రూ.10,500 కోట్ల పెట్టుబడులతో 10 స్టోర్స్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదనతో 2013లో ఐకియా భారత్‌కి వచ్చింది.



# ముంబయి సిక్సర్.. వరుసగా ఆరో విజయంతో అగ్రస్థానానికి



**అయిదుసార్లు విజేత ముంబయి ఇండియన్స్‌కు ఎదురేలేకుండా పోయింది. తొలి అయిదు మ్యాచ్‌ల్లో నాలుగు ఓటములతో ఏమాత్రం పోటీలో లేని ఆ జట్టు ఇప్పుడు దుర్భేద్యంగా మారిపోయింది. మెరిసిన రికిల్‌టన్, రోహిత్ విజృంభించిన బుమ్రా, బౌల్ట్ వంద పరుగుల తేడాతో రాజస్థాన్ చిత్తు జైపుర్**

అయిదుసార్లు విజేత ముంబయి ఇండియన్స్‌కు ఎదురేలేకుండా పోయింది. తొలి అయిదు మ్యాచ్‌ల్లో నాలుగు ఓటములతో ఏమాత్రం పోటీలో లేని ఆ జట్టు ఇప్పుడు దుర్భేద్యంగా మారిపోయింది. ప్రత్యర్థులకు చిన్న అవకాశమైనా ఇవ్వకుండా ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ.. ప్లేఆఫ్స్‌కు అతి చేరువలోకి వచ్చేసింది. వరుసగా ఆరో విజయాన్ని ఖాతాలో వేసుకున్న ముంబయి.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తా చాటడంతో ఆ జట్టు గురువారం రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. పేలవ ప్రదర్శనతో ఎనిమిదో ఓటమిని చవిచూసిన రాజస్థాన్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.

ఐపీఎల్ 18లో ముంబయి ఇండియన్స్ జోరు కొనసాగుతోంది. అన్ని విభాగాల్లోనూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆ జట్టు 100 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై ఘనవిజయం సాధించింది. రికిల్‌టన్ (61; 38 బంతుల్లో 7×4, 3×6), రోహిత్ (53; 36 బంతుల్లో 9×4), సూర్యకుమార్ యాదవ్ (48 నాటౌట్; 23 బంతుల్లో 4×4, 3×6), హార్దిక్ పాండ్య (48 నాటౌట్; 23 బంతుల్లో 6×4, 1×6) మెరవడంతో మొదట ముంబయి 2 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ఛేదనలో రాజస్థాన్ తేలిపోయింది. బౌల్ట్ (3/28), కర్ణ్ శర్మ (3/23), బుమ్రా (2/15) ధాటికి 117 పరుగులకే కుప్పకూలింది. ఆర్చర్ (30) టాప్ స్కోరర్. ఈ గెలుపుతో ముంబయి రన్‌రేట్ కూడా చాలా మెరుగైంది. ఈ మ్యాచ్‌కు ముందు వరకు సాంకేతికంగానైనా రేసులో ఉన్న రాయల్స్.. ఈ ఓటమితో అధికారికంగా ఆ పోటీకి దూరమైంది.

తేలిపోయిన రాయల్స్: గత మ్యాచ్‌లో వైభవ్ వీర విధ్వంసం, జైస్వాల్ మెరుపులతో 200పై లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన రాజస్థాన్.. ఈ పోరులో అందుకు పూర్తి భిన్నంగా ఆడింది. ఛేదనలో పూర్తిగా తేలిపోయి ఘోర పరాజయాన్ని చవిచూసింది. భారీ లక్ష్య ఛేదనలో రాజస్థాన్‌కు బలమైన ఆరంభం అవసరం కాగా.. ప్రారంభంలోనే ఆ జట్టుకు పెద్ద షాక్ తగిలింది. టైటాన్స్‌పై సిక్సర్ల మోతతో మెరుపు శతకం బాదిన 14 ఏళ్ల వైభవ్ ఈసారి కనీసం ఖాతా అయినా తెరవకుండానే వెనుదిరిగాడు. తొలి ఓవర్లో చాహర్ అతణ్ని ఔట్ చేయగా.. రెండో ఓవర్లో జైస్వాల్‌ను బౌల్ట్ బౌల్డ్ చేశాడు. 18 పరుగులకే ఫామ్‌లో ఉన్న ఓపెనర్లిద్దరినీ కోల్పోయిన రాజస్థాన్.. మళ్లీ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. స్థైర్యం దెబ్బతిన్న ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూ చాలా వేగంగా ఓటమి దిశగా సాగింది. పవర్‌ప్లే అయినా పూర్తి కాకముందే ఆ జట్టు ఓటమి ఖాయమైపోయింది. ముంబయి బౌలర్లు విజృంభించడంతో వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే పెవిలియన్ బాట పట్టాడు. నితీశ్ రాణా (9)ను కూడా బౌల్ట్ వెనక్కి పంపాడు. అయిదో ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా.. వరుస బంతుల్లో పరాగ్ (16), హెట్‌మయర్ (0)లను ఔట్ చేయడం ద్వారా రాజస్థాన్ వెన్నువిరిచాడు. ఎనిమిదో ఓవర్లో శుభమ్ దూబె (15)ను హార్దిక్ ఔట్ చేయడంతో 64/6తో ఆ జట్టు కథ ముగిసింది. ఆ తర్వాత పరాజయం లాంఛనమే. మిగతా ఆట ఓటమి అంతరాన్ని తగ్గించడానికి మాత్రమే. కర్ణ్ శర్మ విజృంభించడంతో మిగతా వికెట్లను రాజస్థాన్ చకచకా కోల్పోయింది. ఆర్చర్, మధ్వాల్ (4 నాటౌట్) ముంబయి విజయాన్ని కాస్త ఆలస్యం చేశారు.

రికిల్‌టన్, రోహిత్ ధనాధన్: మరోసారి బ్యాటుతో అదరగొట్టిన ముంబయి మొదట భారీ స్కోరు సాధించింది. అదిరే ఆటతో రికిల్‌టన్, రోహిత్ బలమైన పునాది వేస్తే.. ఆ తర్వాత సూర్యకుమార్, హార్దిక్ రెచ్చిపోయారు. ముంబయి టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా... తొలి మూడు ఓవర్లలో 16 పరుగులే వచ్చాయి. రెండో ఓవర్లోనే ఫారూఖీ బౌలింగ్‌లో రోహిత్‌ను అంపైర్ ఎల్బీగా ప్రకటించినా.. అతడు సమీక్షతో బతికిపోయాడు. నాలుగో ఓవర్ నుంచి బాదుడు మొదలైంది. ఫారూఖీ బౌలింగ్‌లో వరుసగా 6, 4తో జోరందుకున్న రికిల్‌టన్.. వెంటనే ఆర్చర్ బౌలింగ్‌లో 4, 6 దంచేశాడు. తన తొలి ఓవర్లో రెండే పరుగులిచ్చిన ఆర్చర్.. రెండో ఓవర్లో 18 పరుగులు సమర్పించుకున్నాడు. తీక్షణ బౌలింగ్‌లో రోహిత్ వరుసగా రెండు బౌండరీలు కొట్టాడు. బ్యాటర్లిద్దరూ చకచకా ఫోర్లు కొడుతూ సాగడంతో పది ఓవర్లు ముగిసేసరికి ముంబయి 99/0తో నిలిచింది. రికిల్‌టన్ 29 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. 12వ ఓవర్లో తీక్షణ బౌలింగ్‌లో ఫోర్‌తో అర్ధసెంచరీ సాధించాడు. కానీ అదే ఓవర్లో రికిల్‌టన్ నిష్క్రమించడంతో 116 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాతి ఓవర్లోనే రోహిత్‌ను పరాగ్ వెనక్కి పంపినా.. రాజస్థాన్‌కు పెద్దగా సంతోషించడానికేమీ లేకపోయింది. స్కోరుబోర్డును పరుగులు పెట్టించే బాధ్యతను హార్దిక్, సూర్యకుమార్ తీసుకున్నారు. ఇద్దరూ అలవోకగా షాట్లు ఆడారు. ఫారూఖీ బౌలింగ్‌లో రెండు ఫోర్లు కొట్టేసిన సూర్య.. తీక్షణ, ఆర్చర్ ఓవర్లలో సిక్స్‌లతో అలరించాడు. హార్దిక్ మూడు ఫోర్లు, ఓ సిక్స్ బాదడంతో ఇన్నింగ్స్ 18వ ఓవర్లో ఫారూఖీ ఏకంగా 21 పరుగులు సమర్పించుకున్నాడు. మధ్వాల్ బౌలింగ్‌లో లాంగాన్‌లో సిక్స్‌తో ముంబయి ఇన్నింగ్స్‌ను సూర్య ఘనంగా ముగించాడు. సూర్యహార్దిక్ జంట అభేద్యమైన మూడో వికెట్‌కు 44 బంతుల్లోనే 94 పరుగులు జోడించింది.

ముంబయి ఇన్నింగ్స్: రికిల్‌టన్ (బి) తీక్షణ 61; రోహిత్ (సి) జైస్వాల్ (బి) పరాగ్ 53; సూర్యకుమార్ నాటౌట్ 48; హార్దిక్ నాటౌట్ 48; ఎక్స్‌ట్రాలు 7 మొత్తం: (20 ఓవర్లలో 2 వికెట్లకు) 217; వికెట్ల పతనం: 1116, 2123; బౌలింగ్: ఆర్చర్ 40420; ఫారూఖీ 40540; తీక్షణ 40471; కార్తికేయ 20220; ఆకాశ్ మధ్వాల్ 40390; రియాన్ పరాగ్ 20121

రాజస్థాన్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (బి) బౌల్ట్ 13; వైభవ్ సూర్యవంశీ (సి) జాక్స్ (బి) దీపక్ చాహర్ 0; నితీశ్ రాణా (సి) తిలక్ (బి) బౌల్ట్ 9; రియాన్ పరాగ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 16; ధ్రువ్ జురెల్ (సి) అండ్ (బి) కర్ణ్ శర్మ 11; హెట్‌మయర్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 0; శుభమ్ దూబె (సి) బౌల్ట్ (బి) హార్దిక్ 15; ఆర్చర్ (సి) బుమ్రా (బి) బౌల్ట్ 30; తీక్షణ (సి) సూర్యకుమార్ (బి) కర్ణ్ శర్మ 2; కార్తికేయ (సి) దీపక్ చాహర్ (బి) కర్ణ్ శర్మ 2; మధ్వాల్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 15 మొత్తం: (16.1 ఓవర్లలో ఆలౌట్) 117; వికెట్ల పతనం: 11, 218, 341, 447, 547, 664, 776, 887, 991; బౌలింగ్: దీపక్ చాహర్ 20131; బౌల్ట్ 2.10283; బుమ్రా 40152; బోష్ 30290; హార్దిక్ 1021; కర్ణ్ శర్మ 40233

# ధోనికి ఇలా జరగడం ఇదే తొలిసారి..!

ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్ రేసు నుంచి చెన్నై సూపర్ కింగ్స్ అధికారికంగా నిష్క్రమించింది. నిన్న (ఏప్రిల్ 30) పంజాబ్ కింగ్స్ చేతిలో ఓటమితో ఈ సీజన్‌లో ఆ జట్టు ఖేల్ ఖతమైంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన సీఎస్‌కే ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో కేవలం రెండే విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో ఉంది. ఈ జట్టు ఈ సీజన్‌లో మరో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

సీఎస్‌కేకు ఈ మ్యాచ్‌లు అంత ముఖ్యం కాకపోయినా ఇతర జట్ల ప్లే ఆఫ్స్ అవకాశాలను నిర్ణయిస్తుంది. సీఎస్‌కే తమ తదుపరి మ్యాచ్‌ల్లో ఆర్సీబీ (మే 3), కేకేఆర్ (మే 7), రాజస్థాన్ రాయల్స్ (మే 12), గుజరాత్ టైటాన్స్‌తో (మే 18) తలపడనుంది. పైన ఉన్న జట్లన్నీ ప్లే ఆఫ్స్ రేసులో ఉండటంతో సీఎస్‌కే నిర్ణయాత్మక శక్తిగా మారనుంది.

ఇదిలా ఉంటే, ఈ సీజన్ ఆరంభంలో రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో ధోని సీఎస్‌కే పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. ధోని కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినా సీఎస్‌కే తలరాత ఏమీ మారలేదు. వరుస పరాజయాలతో సతమతమైంది. ఫ్యాన్స్ సైతం చాలా రోజుల కిందటే సీఎస్‌కేపై ఆశలు వదులుకున్నారు.

ఈ సీజన్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తర్వాత ధోని ఓ అపప్రదను మూటగట్టుకున్నాడు. తొలిసారి వరుసగా రెండు ఐపీఎల్ ఫైనల్స్ మిస్ అయ్యాడు (కానున్నాడు). ఐపీఎల్ ప్రారంభం నుంచి ఆడుతున్న ధోని ఇప్పటివరకు ఒక్కసారి కూడా వరుసగా రెండు ఫైనల్స్ ఆడకుండా ఉండలేదు.

ఓ సీజన్ మిస్ అయినా మరుసటి సీజన్‌లోనే ఫైనల్ ఆడాడు. మొత్తంగా ధోని తన ఐపీఎల్ కెరీర్‌లో 11 ఫైనల్స్ (10 సీఎస్‌కే తరఫున, ఒకటి రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ తరఫున) ఆడాడు. ధోని ఆడిన ఐపీఎల్ ఫైనల్స్..

2008 (రన్నరప్)
2010 (ఛాంపియన్)
2011 (ఛాంపియన్)
2012 (రన్నరప్)
2013 (రన్నరప్)
2015 (రన్నరప్)
2017 (రన్నరప్, పూణే తరఫున)
2018 (ఛాంపియన్)
2019 (రన్నరప్)
2021 (ఛాంపియన్)
2023 (ఛాంపియన్)

ధోని ఆడని ఐపీఎల్ ఫైనల్స్
2009
2014
2016
2020
2022
2024
2025



## మేము ఇంకొన్ని పరుగులు చేయాల్సింది : ధోనీ

పంజాబ్‌కింగ్స్‌తో బుధవారం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ పరాజయంతో ప్లేఆఫ్స్ రేస్ నుంచి అధికారికంగా వైదొలిగిన తొలి టీమ్‌గా చెన్నై నిలిచింది.
ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ ప్రదర్శన అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. బుధవారం పంజాబ్‌కింగ్స్ తో ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ పరాజయంతో ప్లేఆఫ్స్ రేస్ నుంచి అధికారికంగా వైదొలిగిన తొలి టీమ్‌గా చెన్నై నిలిచింది. ఈ జట్టు వరుసగా రెండు సీజన్లలో ప్లేఆఫ్స్‌నకు చేరకుండానే ఇంటిదారి పట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై ఒక దశలో 200 పరుగులు దాటేలా కనిపించింది. కానీ చాహల్ మాయతో చివరికి 19.2 ఓవర్లకు 190 పరుగులకే ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన పంజాబ్ కింగ్స్ 19.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 194 రన్స్ చేసింది.
'ఈ సీజన్‌లో మేం మొదటిసారి చెప్పుకోదగ్గ స్కోర్ చేశాం. కానీ ఇంకొన్ని పరుగులు చేసి ఉంటే బాగుండేది. అలాగే మేం క్యాచ్‌లను ఒడిసిపట్టి ఉండాల్సింది. బ్రెవిస్, సామ్‌కరణ్‌ల మధ్య భాగస్వామ్యం బాగుంది. మేం మరో నాలుగు బంతులు మిగిలిఉండగానే ఆలౌట్ అయ్యాం. నలుగురు బ్యాటర్లు వెంటవెంటనే ఔటయ్యారు. ఇలా ఈ బంతులు మేం వృథా చేసుకున్నాం. వీటినీ సమర్థంగా వాడుకొని ఉండాల్సింది. సామ్‌కరణ్ పోరాటయోధుడు. చక్కగా ఆడాడు. కానీ మేం మరో 15 పరుగులు అదనంగా చేసి ఉంటే బాగుండేది. మిడిల్ ఆర్డర్‌లో బ్రెవిస్ కూడా తనవంతు పాత్ర పోషించాడు' అని మ్యాచ్ అనంతరం ధోనీ అన్నాడు.
ఈ మ్యాచ్‌లో సామ్ కరణ్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. కేవలం 47 బంతుల్లోనే 88 పరుగులు చేశాడు. తొమ్మిది ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. పవర్‌ప్లేలో చెన్నై 3 వికెట్ల నష్టానికి 48 పరుగులు చేసింది. సామ్‌కరణ్ బ్రెవిస్‌తో కలిసి 78 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇదే చెన్నై పెద్ద స్కోర్ చేసేలా సాయపడింది. కానీ ఆఖర్లో చాహల్ ధోనీ వికెట్ తీసిన తర్వాత దీపక్ హుడా, అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్‌లను వరుస బంతుల్లో ఔట్ చేసి ఐపీఎల్‌లో తన రెండో హ్యాట్రిక్‌ను సాధించాడు. చివర్లో చాహల్ విజృంభించడంతో మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే చెన్నై 190 పరుగులకే ఆలౌటైంది.

# PSL వల్ల మాకు నాణ్యమైన ఆటగాళ్లు దొరకట్లేదు: పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్



**ఐపీఎల్ 2025 సీజన్ కీలక దశకు చేరిన వేళ పంజాబ్ జట్టును గాయాల బెడద వెంటాడుతోంది. ఫెర్గూసన్, మ్యాక్స్‌వెల్ గాయాల వల్ల టోర్నీకి దూరమయ్యారు. వీరి స్థానంలో పంజాబ్ ఇంకా ఎవరిని జట్టులోకి తీసుకోలేదు.**

ఈ ఐపీఎల్ సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ కింగ్స్ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్కేను పంజాబ్ 4 వికెట్ల తేడాతో ఓడించింది. 10 మ్యాచ్‌లు ఆడి 13 పాయింట్లతో ఉన్న పంజాబ్ ప్లే ఆఫ్స్ చేరడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ఆ జట్టును గాయాల బెడద వెంటాడుతోంది. సీజన్ ఆరంభంలో కివీస్ పేసర్ లాకీ ఫెర్గూసన్ తొడ కండరాల గాయంతో టోర్నీ నుంచి వైదొలిగాడు. తాజాగా ఆసీస్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వేలి గాయంతో ఈ ఐపీఎల్ సీజన్‌లో మిగత మ్యాచ్‌లన్నింటికీ దూరమయ్యాడు. చెన్నైతో మ్యాచ్ ముంగిట ప్రాక్టీస్ చేస్తుండగా అతడి వేలు విరిగింది. అయితే, పంజాబ్ ఇంకా వీరిద్దరి స్థానంలో ఎవరిని జట్టులోకి తీసుకోలేదు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో పీఎస్ఎల్ జరుగుతోంది. ఐపీఎల్ జరుగుతున్న సమయంలోనే పీఎస్ఎల్‌ను నిర్వహిస్తుండటం వల్ల తమకు రీప్లేస్‌మెంట్‌గా నాణ్యమైన విదేశీ ఆటగాళ్లు దొరకడం లేదని పంజాబ్ కింగ్స్ కోచ్ రికీ పాంటింగ్ అన్నాడు. భారత్‌లో ఉన్న యువ ఆటగాళ్లను కూడా పరిశీలిస్తున్నామని, త్వరలోనే కొత్త వారిని జట్టులోకి తీసుకుంటామని తెలిపాడు.

పంజాబ్ కింగ్స్‌తో సామ్ కరన్ వివాదం!
'నిజం చెప్పాలంటే రీప్లేస్‌మెంట్‌ల విషయంలో మేం కొంచెం ఓపిగ్గా ఉన్నాం. మ్యాక్స్‌వెల్ గాయపడి రెండ్రోజులే అవుతోంది. లాకీ ఫెర్గూసన్ టోర్నీకి దూరమై రెండు వారాలు దాటింది. పాకిస్థాన్ సూపర్ లీగ్ కూడా ఇప్పుడే జరుగుతోంది. చాలా మంది విదేశీ ప్లేయర్లు ఆ లీగ్‌లో ఆడుతున్నారు. దీంతో మాకు రీప్లేస్‌మెంట్ కోసం నాణ్యమైన ఆటగాళ్లు దొరకడం లేదు. దీంతో మేం ఓపికతో ఉంటున్నాం. భారత్‌లోని ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లపై కూడా దృష్టిపెట్టాం. నిన్న చెపాక్‌లో మా జట్టులో శిక్షణ పొందిన కొంతమంది కుర్రాళ్లు మాతో ధర్మశాలకు వస్తారు. మేము వారిని నిశితంగా పరిశీలిస్తాము. వారు పంజాబ్ జట్టు కాంట్రాక్ట్ పొందొచ్చు. ఈ వారంలో రీ ప్లేస్‌మెంట్‌లు పూర్తవుతాయి' అని రికీ పాంటింగ్ వివరించాడు. పంజాబ్ తదుపరి మ్యాచ్‌లో (మే 4, ధర్మశాల) లఖ్‌నవూతో తలపడనుంది.

# అర్షద్ నదీమ్ ఇన్‌స్టా ఖాతా భారత్‌లో బ్లాక్!

**పాకిస్థాన్ జావెలిన్ త్రో అథ్లెట్ అర్షద్ నదీమ్ ఇన్‌స్టా ఖాతాను భారత్ బ్లాక్ చేసింది.**

పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత భారత్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో పాక్‌కు సంబంధించి యూట్యూబ్ ఛానల్స్ ఇతర సోషల్ మీడియా ఖాతాలను మన దేశంలో బ్లాక్ చేసిన భారత్.. తాజాగా మరో క్రీడాకారుడి ఖాతాపై చర్యలు చేపట్టింది. ఆ దేశ అథ్లెట్ అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను భారత్‌లో నిలిపివేసింది.

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది ప్రాణాలు బలిగొన్న సంగతి తెలిసిందే. దీంతో పాక్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ ఎదురుచూస్తోంది. ఇందులోభాగంగా ఇప్పటికే ఆ దేశ యూట్యూబర్ హనియా ఆమిర్‌తో పాటు పలువురు క్రీడాకారుల సామాజిక మాధ్యమ ఖాతాలను బ్లాక్ చేసింది. తాజాగా నదీమ్ ఇన్‌స్టా ఖాతాలను నిలిపివేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో అథ్లెట్ అర్షద్ నదీమ్ సత్తా చాటిన సంగతి తెలిసిందే. జావెలిన్ త్రోలో 92.97 మీటర్లు విసిరి స్వర్ణం సాధించాడు.

పంజాబ్ కింగ్స్‌తో సామ్ కరన్ వివాదం!
కాగా.. ఉగ్రదాడి ఘటన తర్వాత పాకిస్థాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. దేశం విడిచి వెళ్లిపోవాలని పాక్ జాతీయులకు భారత ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అందుకు గడవు కూడా విధించింది. ఇప్పటివరకు 780కి పైగా దేశం విడిచి వెళ్లిపోయారు. వారిలో 55 మంది దౌత్యాధికారులు, వారి డిపెండెంట్లు, సహాయక సిబ్బంది, 8 మంది పాకిస్థాన్ వీసాలు ఉన్న భారతీయులున్నారు.

